క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):ముత్యాలంపాడు సెక్షన్ అయోధ్యనగర్, బుడమేరు కట్ట ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మత్తుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టార్ 3, సెక్టార్ 4, సీకే రెడ్డి రోడ్డు, ఇందిరా టవర్స్ ,రిలయన్స్ మార్ట్ ,అయోధ్య నగర్ మెయిన్ రోడ్డు, పలగాని ప్రభాకర రావు వీధి, అయోధ్య నగర్ ఒకటో రోడ్డు నుండి ఏడో రోడ్డు వరకు ,చింత చెట్టు బజార్, ఘట్టా రత్తయ్య వీధి, అయోధ్య నగర్ డొంక రోడ్డు, సాయిబాబా గుడి రోడ్డు, అగ్రి గోల్డ్ శివాలయం , గన్నా బత్తుల బాబురావు వీధి , పసుపులేటి వారి వీధి, రామదాసు ఆది నారాయణ వీధి ,సూర్యబాల అపార్మెంట్ రోడ్డు, బుడమేరు కట్ట ఏరియా, సూరిబాబు కాలనీ, శారదా స్కూల్ ఏరియా, క్షత్రియ భవన్ ఏరియా, రామలింగేశ్వరపేట రెండో లైను తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

వాంబేకాలనీలో అగ్ని ప్రమాదం



పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీ హెచ్‌బ్లాక్ 39 జీఎఫ్3 ప్లాట్‌లో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంట్లోని ఫర్నిచర్, సామాన్లు కాలిపోయాయి.కొల్లూరి కోటేశ్వరి అనే మహిళ శ్రావణం శుక్రవారం సందర్భంగా ఇంట్లో దీపారాధన ముగించుకొని డ్యూటీ నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లింది. దీపారాధన మంట ఇంట్లో వున్న కర్టెన్లుకు అంటుకొని ఫర్నిచర్, సామగ్రి కాలిపోయింది. ప్లాట్ నుంచి పొగరావడం గమనించి అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. అగ్నిమాపక శాఖాధికారి ఎస్.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. నష్టం రెండు లక్షల రూపాయలుంటుందని అంచనా వేశారు.

అర్హతే కొలమానం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అర్హతే కొలమానంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని, ఆ దిశగా డివిజన్‌లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించం జరుగుతుందని స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్‌లో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీలో ఆయన లబ్ధిదారులకు అందజేశారు.

మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నేడు ప్రత్యేక ప్రసంగం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సీ. రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న డిప్లొమో కోర్సు ఇన్ జర్నలిజంలో భాగంగా నేడు శనివారం ప్రత్యేక ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ జి.శ్రీరామ్‌కుమార్ హాజరై రిజిస్ట్రేషన్లు-విధి విధానాలు అనే అంశంపై మాట్లాడతారని పేర్కొన్నారు. డిప్లొమో కోర్సు చేస్తున్న వారితో పాటుగా ఆసక్తి ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు జూమ్ ఐడీ-815 9892 6979, పాస్‌వర్డ్-12345 ద్వారా హాజరై ఈ ప్రసంగాన్ని వినవచ్చన్నారు.

విప్లవాత్మక సంస్కరణలతో అగ్రస్థానం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్ధిదారులకు బ్రోచర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన అనేక విప్లవాత్మకమైన సంస్కరణలు ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపాయని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 63వ డివిజన్ 279వ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఉడా కాలనీలో విస్తృతంగా పర్యటించి 140 గడపలను సందర్శించారు. ఆయా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చిట్టచివరి కాలనీవరకు రహదారులతో సహా సకల సదుపాయాలు కల్పించడంపై ఎకానమిక్ బ్యాక్‌వర్డ్‌సెక్షన్ (ఈడబ్ల్యుఎస్) కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేస్తూ శాలువాలతో సత్కరించారు. ఒక్కో కుటుంబానికి రూ. లక్ష నుంచి అత్యధికంగా రూ.5లక్షల వరకు ప్రభుత్వ పథకాల ద్వారా మేలు చేకూరినట్లు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఏ పనికైనా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, కానీ ఈ ప్రభుత్వంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

గతంలోనే చంద్రబాబు అట్టర్ ఫ్లాప్...

ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ముమ్మాటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాలకు కాపీ వెర్షన్ అని విమర్శించారు. బాబు ప్రకటించిన చాలా పథకాలు ప్రస్తుతం ఏపీలో అమలవుతున్నవేనని మరికొన్ని తమిళనాడు, కర్ణాటకలో అమలవుతున్న పథకాలను కాపీ కొట్టారని ఎద్దేవా చేశారు. టీడీపీ హామీలు గమనించిన ఎవరికైనా చంద్రబాబు సీఎం జగన్‌ను ఫాలో అవుతున్నారనే విషయం స్పష్టంగా అర్థమవుతుందని చెప్పారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసి ప్రజలకు ఏం కావాలో చంద్రబాబు కనీసం తెలుసుకోలేక పోయారని, బాబు ఆల్ ఫ్రీ స్లోగన్ గతంలోనే అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. కానీ పిన్న వయస్సులో మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పటికీ ప్రజల అవసరాలన్నింటినీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్చారన్నారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, డివిజన్ కోఆర్డినేటర్ పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, టిక్కం కృష్ణ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కొత్తగా మంజూరైన పింఛన్లు మంజూరు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నట్లు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 63వ డివిజన్ మల్లాది వెంకటసుబ్బయ్య కమ్యూనిటీహాల్లో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను శుక్రవారం అవ్వాతాతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పింఛన్లు అవ్వాతాతల ముఖాల్లో వెలుగులు నింపాయని చెప్పారు. ప్రతి నెలా ఒకటవ తేదీన రాష్ట్రంలోని 64 లక్షల కుటుంబాల్లో వైఎస్సార్ పింఛన్ కానుక పథకం పండుగ వాతావరణం తీసుకొస్తుందన్నారు. చంద్రబాబు పాలనలో ఒక్క కొత్త పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏటా రెండుసార్లు నూతన పింఛన్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో కేవలం 17 వేల పింఛన్లు మాత్రమే ఉన్నాయని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 26,118 మందికి పింఛన్లు అందిస్తున్నామని వెల్లడించారు. కొత్తగా మంజూరైన 645 పింఛన్లతో కలిపి ఆ సంఖ్య 26,763 కి చేరిందన్నారు. గతంలో పోలిస్తే దాదాపు 10 వేల మందికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెనువెంటనే రూ. 2,250 కు పెంచడంతో పాటు 2022 జనవరిలో రూ.2,500కు, ఈ జనవరిలో 2,750 కి పెంచుకుంటూ వచ్చారని తెలిపారు. అంతే కాకుండా పింఛన్ అర్హతను 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించడం ద్వారా ఎన్నో లక్షల మందికి నూతన పింఛన్లు తీసుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, పార్టీ నాయకులు పాల్గొన్నారు. 61వ డివిజన్లో కొత్తగా మంజూరైన 28 పింఛన్లను కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి వెంకట్రావ్, 62వ డివిజన్లో కొత్తగా మంజూరైన 46 పింఛన్లను కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి, 64వ డివిజన్లో కొత్తగా మంజూరైన 29 పింఛన్లను కార్పొరేటరు యరగొర్ల తిరుపతమ్మ పంపిణీ చేశారు.

డివిజన్లలో నూతన పింఛన్లు పంపిణీ



ముత్యాలంపాడులో పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ పెనుమత్స శిరీష



కొత్తగా పింఛన్ మంజూరయిన లబ్ధిదారులతో కార్పొరేటర్ జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్ ముత్యాలంపాడులో శుక్రవారం తెల్లవారుజాము నుంచే పింఛన్‌ల పంపిణీ ప్రారంభమయ్యింది. కార్పొరేటర్ పెనుమత్స శిరీష, వార్డు సచివాలయం ఇన్‌చార్జి భువన, వెల్ఫేర్ సెక్రటరీ కె.నాగరాజు, వలంటీర్ భాగ్యశ్రీతో కలిసి పింఛన్‌లు అందజేశారు. 30వ డివిజన్ దేవీనగర్‌లో శుక్రవారం డివిజన్‌లో 50 మందికి నూతనంగా మంజూరైన పింఛన్లు కార్పొరేటర్ జానారెడ్డి పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాస్, దుర్గారావు, సీహెచ్ సుబ్బారెడ్డి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు



దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో



శ్యామలాంబ దేవి అమ్మవారు



అంకమ్మతల్లి శక్తిపీఠంలో



ముత్యాలంపాడులో అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్):అమ్మవారికి ప్రీతికరమైన శ్రావణ మాసం, శుక్రవారం కావటంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మ పరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రావణ మాసం విశిష్ఠతను వివరించారు. పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ మాట్లాడుతూ శ్రావణ మాసంలో ఇంటి వద్ద వ్రతాలు చేసుకోలేని వారి కోసం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మధురానగర్ నేతాజీ కాలనీలోని అంకమ్మతల్లి శక్తిపీఠంలో పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాలంపాడులోని పార్వతీసమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయం, దావు బుచ్చయ్యకాలనీలోని శ్యామలాంబదేవి దేవాలయంలో పూజలు జరిగాయి.

3న ఘంటసాల సంగీత వైభవంపై ప్రసంగం

విజయవాడ కల్చరల్: స్వరలయ సంగీత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వర రావు సంగీత కళాశాలలో ఘంటసాల సంగీత వైభవం, సినీ సంగీత విభావరి నిర్వహిస్తునట్లు స్వరలయ అధ్యక్షుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ నాద బ్రహ్మ సంగీత కళాశాల ఆచార్యులు డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్య ఘంటసాల సంగీత వైభవం అంశంగా ప్రసంగిస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన గాయనీ గాయకులు క్లాసికల్ చిత్ర గీతాలను ఆలపిస్తారన్నారు.

తోటివారికి సాయం చేయాలి



కుట్టుమిషన్ అందజేస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేతులే మిన్న అని ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో తోటివారికి సాయం చేయటం అలవాటుగా చేసుకోవాని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దీనజన బంధువు, విశ్వమాత మదర్ థెరిసా జయంతి పురస్కరించుకుని అంజలి లయన్స్ క్లబ్, ఎక్స్ రే సంస్థల ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవలతో ప్రతి భారతీయుని మనస్సులలో మదర్‌థెరిసా చిరస్మరణీయమైన స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. అనంతరం డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్, దుర్గా తేజ అధ్యక్షురాలు డి.లక్ష్మి కుమారి సహకారంతో పేదలకు కుట్టు మిషను, సైకిల్ పంపిణీ చేశారు. అంజలి క్లబ్ అధ్యక్షులు వై.సుధాకర్ బాబు, కొల్లూరి బోడి ఆంజనేయ రాజు,గుర్రం ఏడు కొండలు, కొండాయ గుంట రాము, తదితరులు పాల్గొన్నారు.

మనోహరం త్యాగరాజ కృతి వైభవం



పారుపల్లి ఇభానన్ మాండలిన్, ప్రభానన్ వేణువు కచరీ

విజయవాడ కల్చరల్: లయనాద కళాస్రవంతి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న లంకా వేంకటేశ్వర్లు సంగీత సంస్మరణోత్సవాలు త్యాగరాజ స్వామి కృతి వైభవాన్ని చాటుతున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు వాగ్గేయకార కృతులను మధురంగా ఆలపించారు. శ్రావణి కచేరీతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చిన్నారులు పారుపల్లి ఇభానన్ మాండలిన్‌పై పారుపల్లి ప్రభానన్ వేణువుపై మహాగణపతిం ఆదితాళం, ఎందరో మహానుభావులు, సామజవరగమన త్యాగరాజ స్వామి కృతులు వెంకటచాల నిలయ కీర్తనలను పలికించారు. చివరిగా జే శ్రీరాం, కేవీ శ్రీరాం, డీ విఘ్నేష్,కేవ సుధాంశు త్యాగరాజ స్వామి దివ్యనామ సంకీర్తనలు ఆలాపించారు. కేవీ సుబ్బారావు హార్మోనియం , రాఘవచరణ్ తబలపై, అరవింద్ మృదంగంపై సహకరించారు.

వీఎంసీ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ మేళా

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని న్యూ రాజేశ్వరిపేట, వాంబే కాలనీలో గతంలో కేటాయించిన ఇళ్ల లబ్ధిదారులకు, కొనుగోలు చేసిన వారికి వీఎంసీ రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తుందని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇళ్లను ఎలాట్ పొందినవారు, ఎలాట్ పొందిన 10 సంవత్సరాల తర్వాత కొనుగోలు చేసిన నాన్ ఎలాట్ దారులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇందుకు గజం రూ. 100 చొన్నున 40 గజాల స్థలానికి రూ. 4వేలు, రిజిస్ట్రేషన్ చార్జీల నిమిత్తం రూ. 860 చొప్పున చెల్లించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు ఒరిజినల్ ఎలాట్‌మెంట్ పట్టా, నాన్‌ఎలాట్‌మెంట్‌దారులైతే వారి పేరుత ఒరిజినల్ విక్రయ డాక్యుమెంట్ (లింక్‌తో సహా), నోటరీ అఫడవిట్, ప్రస్తుతం చెల్లిస్తున్న నీటి, ఇంటి పన్నుల రసీదులు, ఆధార్‌కార్డు నకలు, ఇద్దరి సాక్షుల ఆధార్‌కార్డు నకలు తీసుకుని న్యూ రాజరాజేశ్వరి పేటలోని సచివాలయం నం 233, వాంబేకాలనీలోని డి బ్లాక్ కమ్యూనిటీ హాల్లో జరిగే మేళాలో సంప్రదిచాలని కోరారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి వారం రోజులపాటు నిర్వహించే మేళా వినియోగించుకోవాలని కోరారు.

చెస్‌లో హేమంత్‌కుమార్‌కు ఫిడే రేటింగ్

చిట్టినగర్:ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌లో తమ విద్యార్థి హేమంత్ కుమార్ రేటింగ్ సాధించడం అభినందనీయమని శ్రీ గౌతమ్ హైస్కూల్ కరస్పాండెంట్ నల్లాని సూర్యారావు తెలిపారు. గత నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన టోర్నమెంట్‌లో రేటింగ్ సాధించిన విద్యార్థికి శుక్రవారం స్కూల్ ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్యారావు మాట్లాడుతూ టోర్నమెంట్‌లో 9 రౌండ్లలో 5.5 పాయింట్లు సాధించడంతో పాటు 1600 గాను 1214 రేటింగ్ సాధించి నగదు పురస్కారం అందుకుందన్నారు. కేవలం చదువులోనే కాకుండా ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లోనూ శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన హేమంత్‌కుమార్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నామని కోచ్ రామకృష్ణ పేర్కొన్నారు. హేమంత్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

పారదర్శక ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



ఓటర్ల జాబితా పరిశీలనలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ఓటరు జాబితాలో తొలగించిన ఓటర్లను పునఃపరిశీలన చేసి పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగ్‌నగర్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూలై నెల 21 తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ నెల రోజుల పాటు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలో భాగంగా బూత్ స్థాయి అధికారులు బూత్ లెవల్ ఏజెంట్ల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఇంటింటిని సందర్శించి ఓటర్ల జాబితా పరిశీలన పూర్తిచేశామని చెప్పారు.

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత సమరి రివిజన్ నుంచి నేటి వరకూ మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్, ఫొటో సిమిలర్ ఎంట్రీస్ గానూ తొలగించిన ఓటర్ల జాబితాను రీ వెరిఫికేషన్ చేస్తున్నామని తెలిపారు. అనర్హత కలిగిన ఓటర్ల తొలగింపు విషయంలో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. బీఎల్ఓలు పరిశీలనలో తొలగింపునకు గుర్తించిన ఓటర్లను మరోసారి క్షేత్రస్థాయిలో నూరు శాతం పరిశీలించాలని బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియను సెప్టెంబర్ 7వ తేదీలోగా పూర్తిచేసి ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పిస్తామని చెప్పారు. కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, అవుతు శ్రీనివాసరెడ్డి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎం.వెంకటరామయ్య, ఎం.మాధురి, ఎన్నికల డెప్యూటీ తహశీల్దార్ ఎస్‌వీ రవీంద్రనాథ్, సూపర్‌వైజర్ వందనంబాబు, బీఎల్‌ఓ జి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పింఛను కానుక పేదలకు వరం



నూతన పింఛన్లు అందిస్తున్న కార్పొరేటర్ షాహీనా సుల్తానా



పంపిణీ చేస్తున్న పంపిణీ చేస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులందరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. 58వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన 64 పింఛన్లను శుక్రవారం ఆమె లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు. 59వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన పింఛన్లు కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా పంపిణీ చేశారు.

సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా కార్యాలయం వద్ద జరిగిన ఈ పంపిణీ ఆమె పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్ తదితరులు పాల్గొన్నారు.